ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 9 జూలై 2025



11న రైళ్లు రద్దు

టెక్కలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ పరిధిలో మోడ్రన్ ఎలక్ట్రానిక్స్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్ పనుల కారణంగా ఈనెల 11న పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ నుంచి గుణుపూర్ (58506), గుణుపూర్ - విశాఖ (58505), విశాఖ - బరంపురం (58532), బరంపురం - విశాఖ(58531), విశాఖ - పలాస (67289), పలాస - విశాఖ(67290) పాసింజర్ రైళ్లను రద్దు చేశాం. అలాగే భువనేశ్వర్ - విశాఖ (22819) ఇంటర్‌సిటీ, విశాఖ- భువనేశ్వర్ (22820) ఇంటర్‌సిటీ, విశాఖ- బరంపురం (18526) ఎక్స్‌ప్రెస్, బరంపురం - విశాఖ (18525) ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రద్దు చేస్తున్నామని సందీప్ తెలిపారు.

కిడ్నీ వ్యాధి కబళిస్తోంది

- కిట్టాలపాడులో మూడేళ్లలో ఏడుగురి మృతి
- పట్టించుకోని గత ప్రభుత్వం
- తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



కిట్టాలపాడు గ్రామం



● టెక్కలి మండలం కిట్టాలపాడు గ్రామానికి చెందిన **కందు అప్పన్న** కిడ్నీవ్యాధితో బాధపడుతూ.. నెలరోజుల కిందట మృతి చెందాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు.



● ఇదే గ్రామానికి చెందిన **మోద లక్ష్మీనారాయణ** కూడా ఎనిమిది నెలల కిందట కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు ఆర్థికం గా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం వితంతు పింఛన్ కూడా తనకు మంజూరు కాలేదని భార్య పార్వతి వాపోతోంది.

● కందు అప్పన్న, మోద లక్ష్మీనారాయణతోపాటు గ్రామానికి చెందిన మోద సవరయ్య, మెండబోయిన అప్పన్న, ఎం.వెంకటరావు, మెండ బోయిన కృష్ణమూర్తి, మోద కృష్ణ మూర్తిని కూడా కిడ్నీ మహమ్మారి బలిగొంది. ఇలా గత మూడేళ్లలో కిడ్నీవ్యాధితో ఏడుగురు మృతి చెంద డంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కిడ్నీవ్యాధి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.



ఫ్లోరైడ్ నీటిగా గుర్తించిన బావి

టెక్కలి రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి):

టెక్కలి మండలానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కిట్టాలపాడు గ్రామాన్ని కిడ్నీ వ్యాధి కబళిస్తోంది. గ్రామంలో సుమారు 75 కుటుంబాల్లో 300 మంది జనాభా ఉన్నారు. గత పదేళ్ల నుంచి చాలా మంది కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారు. గత మూడేళ్లలో ఏడుగురు కిడ్నీవ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. గ్రామంలో నీటిని పరీక్షించగా ఫ్లోరైడ్ సమస్య ఉందని గుర్తించారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో గత్యంతరం లేక గ్రామంలో ఉన్న బావినీటినే వినియోగిస్తున్నారు. ఎన్నికలకు ఏడాది ముందు గ్రామంలో సోలార్ పంపు సెట్ ఏర్పాటు చేసి నీటి సరఫరా చేశారు. కానీ, అప్పటికే కిడ్నీ బాధితులు పెరిగిపోయారు. ఫ్లోరైడ్ సమస్య వల్ల చాలామంది కీళ్లనొప్పులతో బాధపడుతున్నారు. ప్రస్తుతం వ్యాధి తీవ్రత, కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది డయాలసిస్ కోసం టెక్కలిలో జిల్లా ఆస్పత్రికి వెళ్తున్నారు. గతంలో కిడ్నీ బాధితులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు 108 అంబులెన్స్ వచ్చేది. ప్రస్తుతం అంబులెన్స్ రాకపోవడంతో ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ డబ్బులు ఆటోల్లో వెళ్లేందుకు రవాణా చార్జీలకే సరిపోతున్నాయని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కిడ్నీవ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

● నీటి సరఫరాకు చర్యలు..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు క్లోరినేషన్ చేసిన నీటిని అందించేందుకు జలజీవన్ పథకం కింద రూ.25.06 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో పనులు చేపడుతున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా ఫ్లోరైడ్ నీరు వస్తోంది. దీంతో కిలోమీటరు దూరంలో (మిగతా 6వ పేజీలో..)

రెండు నెలల్లో తాగునీరు..

మంత్రి అచ్చెన్నాయుడు ప్రతిపాదనల మేరకు జలజీవన్ పథకం నిధులు మంజూరయ్యాయి. నర్సింగపల్లిలో బోరు తీసి.. కిట్టాలపాడులో 5వేల లీటర్లు నిల్వ ఉండే ట్యాంకును నిర్మించి నీటిని సరఫరా చేస్తాం. రెండు నెలల్లో పనులు పూర్తిచేసి.. ఇంటింటికీ తాగునీరు అందిస్తాం.

-మోహనరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, టెక్కలి

ఆ పెట్టెలో ఏముంది?

- జాలర్లకు చిక్కిన ఐరన్ బాక్స్
- ఓ ఆసామికి రూ.3వేలకు విక్రయం
- గుప్తనిధులు ఉన్నాయని ప్రచారం
- సురవరంలో చోరీ చేసి.. నదిలో పడేసిన దొంగలు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



వంశధార నదిలో జాలర్లకు లభ్యమైన ఇనుప పెట్టె

నరసన్నపేట/జలుమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వారం క్రితం నరసన్నపేట మండలం చోడవరం గ్రామానికి చెందిన సైలాడ బుచ్చయ్య, మడ్డి రామకృష్ణ అనే జాలర్లు గెడ్డవానిపేట- కోమనాపల్లి గ్రామాల మధ్య వంశధార నదిలో చేపల వేటకు వెళ్లారు. వేట సాగిస్తుండగా పురాతన ఇనుపపెట్టె వారి వలకు చిక్కింది. ఎంత ప్రయత్నించినా ఇనుపపెట్టె తాళం తెరచుకోలేదు. దీంతో ఆ పెట్టెను వారిద్దరూ గ్రామంలోకి తీసుకువచ్చారు. అందులో గుప్తనిధులు (బంగారం, వెండి ఆభరణాలు) ఉన్నాయని ప్రచారం సాగింది. దీంతో గ్రామానికి చెందిన ఒక ఆసామి ఆ పెట్టెను జాలర్ల వద్ద రూ.3వేలకు కొనుగోలు చేశారు. ఈ విషయం చుట్టుపక్కలా వ్యాపించడంతో అసలు ఆ పెట్టె ఎవరిది? అందులో బంగారు ఆభరణాలు, డబ్బులు ఏమైనా ఉన్నాయా? అనే చర్చ సాగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనపై పోలీసుల దర్యాప్తు సాగుతోంది.

దొంగలు తెరవలేక.. నదిలో పడేశారు

నెల రోజుల కిందట జలుమూరు మండలం నదీ తీర గ్రామమైన సురవరం గ్రామానికి చెందిన సురవరపు శివప్రసాద్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఆ ఇంట్లో లాకర్ ఇనుపపెట్టే చోరీకి గురైంది. దీనిపై శివప్రసాద్ జలుమూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. తాజాగా చోడవరం గ్రామానికి చెందిన జాలర్లకు ఓ ఇనుపపెట్టె దొరికిందనే ప్రచారం సాగడంతో.. బాధితులు వచ్చి ఆరా తీశారు. దొంగలు తెరవలేక ఆ పెట్టెను నదిలో పడేశారని, జాలర్లకు దొరికిన పెట్టె తమదేనని నిర్ధారణకు వచ్చారు. ఈ విషయమై జలుమూరు పోలీసులకు శివప్రసాద్ సమాచారం ఇచ్చారు.

రంగంలోకి దిగిన పోలీసులు

ఇనుపపెట్టె విషయమై జలుమూరు పోలీసులు ఆరా తీశారు. చోడవరం గ్రామానికి చెందిన ఒక ఎం.అప్పారావు అనే ఆసామికి రూ.3వేలకు విక్రయించినట్టు జాలర్లు తెలిపారు. ఆ ఆసామి శ్రీకాకుళంలో ఒక వెల్డర్ వద్ద లాకర్ కట్ చేయించి ఓపెన్ (మిగతా 6వ పేజీలో..)

మత్స్యరంగ అభివృద్ధిని ప్రోత్సహించండి

- కేంద్రమంత్రిని కోరిన వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు



కేంద్రమంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్‌కు వినతి అందజేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు,అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం, జూలై 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో మత్స్యరంగ అభివృద్ధికి మరింత తోడ్పాటు, ప్రోత్సాహం అందజేయాలని కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్(లాలన్ సింగ్)ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. మంగళవారం ఢిల్లీలోని కార్యాలయంలో కేంద్రమంత్రి లాలన్ సింగ్‌తో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు భేటీ అయ్యారు. రాష్ట్రంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి, మత్స్యకారుల అభ్యున్నతికి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం జిల్లా తూర్పు తీరంలో 194 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరాన్ని కలిగి ఉందని.. దేశంలోనే ప్రముఖ 'ఆక్వా హబ్' గా గుర్తింపు పొందిందని తెలిపారు. జిల్లాలో మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడం, వ్యవస్థీకృత మత్స్యవృద్ధిని అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) కింద పలు ప్రతిపాదనలను కేంద్రమంత్రికి వివరించారు. సముద్ర జీవవైవిధ్యాన్ని పెంచేందుకు, సంప్రదాయ మత్స్యకారులకు మద్దతు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో 100 కృత్రిమ రీఫ్‌లను 194 కిలోమీటర్ల తీరరేఖ వెంబడి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

● శ్రీకాకుళం జిల్లాలోని 20 తీర గ్రామాలను సీఆర్‌సీఎఫ్‌వీ(క్లయిమేట్ రెసిలియంట్ మత్స్యకార గ్రామాలు) కింద ఎంపిక చేసి మౌలిక సదుపాయాలు, మత్స్యకారుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న మత్స్య నిల్వ సామర్థ్యాన్ని వెయ్యి నుంచి 2వేల ఫింగర్‌లింగ్స్ హెక్టార్‌కు పెంచడంతోపాటు, అన్ని గ్రామ పంచాయతీ ట్యాంకుల్లో నిల్వకు అనుమతి ఇవ్వాలని ప్రతిపాదించారు. దేశీయ మార్కెటింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి పీఎంఎంఎస్‌వై మార్గదర్శకాల ప్రకారం తాము తెలిపిన అంశాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కూడా ఉన్నారు.

రేపు మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్

- విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరవ్వాలి
- ప్రతీ ఉద్యోగి ఐదు ఇళ్లకు వెళ్లి ఆహ్వానించాలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్



సమావేశంలో పాల్గొన్న జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, డీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయయ్యాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆరోగ్య పరిస్థితులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, వారి భవిష్యత్తుపై దృష్టిపెట్టి చర్యలు చేపట్టడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. మంగళవారం సాయంత్రం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం అరపూట సమయం వెచ్చించాలని కోరారు. పిల్లల ఆశయాలను ఒక పేరాలో రాసి తీసుకురావాలని సూచించారు. బుధవారం ఉదయం ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి కనీసం ఐదు ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఈ సభకు ఆహ్వానించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు.

● వర్షాకాల వ్యాధులపై అప్రమత్తం

వర్షాకాల వ్యాధుల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతీ బుధవారం నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, ప్రతీ శుక్రవారం డ్రైడే పేరుతో పరిసరాలను శుభ్రపరచాలని సూచించారు. 'పాఠశాలలు, కుళాయిల వద్ద నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలి. గిరిజన ప్రాంతాల్లో, బీసీ, ఎస్సీ వసతిగృహాలలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రజల ఆరోగ్యంపై ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేదు. దోమల నియంత్రణ చర్యలు గ్రామస్థాయిలో మరింత పటిష్ఠం చేయాల'ని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. కంపోస్ట్ గుంతలు, నీటిని చేర్చే గుంతల పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రజాఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు పాలకవర్గాలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

6లో

డ్రోన్లతో డేగకన్ను

- పోలీస్‌శాఖలో ఆధునాతన హంగులు
- నేర నియంత్రణకు సరికొత్త సాధనాలు



శ్రీకాకుళంలో డ్రోన్‌కి చిక్కిన మందుబాబులు (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి):

సాంకేతిక వినియోగం ద్వారా నేర నియంత్రణకు పోలీసులు కృషి చేస్తున్నారు. డ్రోన్ల సాయంతో మనుషులు వెళ్లలేని ప్రదేశాలను సైతం జల్లెడ పడుతున్నారు. శివారు ప్రాంతాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెడుతున్నారు. నేరాలు జరగకముందే వాటిని పసిగట్టి నివారణ చర్యలు చేపడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక నేరాల కట్టడికి డ్రోన్ల వినియోగానికి పచ్చజెండా ఊపింది. పోలీసు యంత్రాంగానికి డ్రోన్లు అందజేసింది. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి, జూదం, వ్యభిచారం, ఈవ్‌టీజింగ్, ఆకతాయిల చేష్టలు, ట్రాఫిక్ రద్దీ వంటి నేరాలు తగ్గుముఖం పట్టించే దిశగా డ్రోన్లను పోలీస్‌శాఖ వినియోగిస్తోంది. ప్రస్తుతం మూడు సబ్‌డివిజన్ల పరిధిలో ఒక్కో డ్రోన్ ఉండగా.. జిల్లావ్యాప్తంగా డ్రోన్లను వినియోగించేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 30 పోలీసుస్టేషన్లు ఉన్నాయి. ఒక్కో స్టేషన్‌కు ముగ్గురు కానిస్టేబుళ్లకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ అందించారు. ప్రతి కానిస్టేబుల్‌కు దశలవారీగా శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపడుతున్నారు.

ఎంత దూరం ఉన్నా...

నేరనియంత్రణకు డ్రోన్ల సహకారం తోడైతే సత్ఫలితాలు సాధించే అవకాశం ఉంది. 48 మెగా పిక్సిల్ కెమేరా ఉన్న ఒక్క డ్రోన్ విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుంది. అది 4కే హెచ్‌డీ వీడియో రికార్డింగ్‌తోపాటు రాత్రివేళల్లో కూడా 300 మీటర్ల వరకు వీడియో, ఫోటోలు క్యాప్చర్ చేయగలదు. డ్రోన్లు 500 మీటర్ల ఎత్తు ఎగరగలవు. 500 కిలోమీటర్లు దూరం ప్రయాణించగలవు. ఒక్కో డ్రోన్‌లో 46 నిమిషాలు వచ్చే ఒక బ్యాటరీ ఉండగా, మరో బ్యాటరీ బ్యాకప్ ఉంటుంది. లైవ్‌కెమెరా ద్వారా వీడియోను డ్రోన్‌కు అనుసంధానించిన సెల్‌ఫోన్, కంప్యూటర్‌లో చూడవచ్చు.

హాట్‌స్పాట్‌లను గుర్తించిన వైనం..

జిల్లాలో అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం వంటి ప్రముఖ ఆలయాలు ఉన్నాయి. సుదీర్ఘ సముద్రతీర ప్రాంతముంది. జాతీయ రహదారితోపాటు రైల్వేలైన్ విస్తరించి ఉంది. గంజాయి వంటి మత్తుపదార్థాల రవాణా, వినియోగం జరుగుతోంది. నగరాలు, పట్టణాల్లో చాలా ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఇటువంటి వాటిని హాట్‌స్పాట్‌లుగా పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ఆ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా అసాంఘిక కార్యకలాపాలను చిత్రీకరిస్తున్నారు. ఆయా స్థావరాల వద్దకు వెళ్లి.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల అరసవల్లి రథసప్తమి వేడుకల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం డ్రోన్లను వినియోగించింది. జాతర్లు, ర్యాలీలు, ఉత్సవాలను డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. గతేడాది అక్టోబరు (మిగతా 6వ పేజీలో..)

నేర నియంత్రణకు చర్యలు



జిల్లాలో అత్యధిక శాతం నేర నియంత్రణ డ్రోన్ల సాయంతో చేస్తున్నాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై, పేకాట, గంజాయి వంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తున్నాం. ఇప్పటివరకు జిల్లాకు మూడు డ్రోన్లు మాత్రమే ఏర్పాటు చేశాం. మరో పది డ్రోన్లను అందుబాటులోకి తీసుకొచ్చేం దుకు చర్యలు తీసుకుంటున్నాం. రాత్రివేళల్లో కూడా డ్రోన్ల సాయంతో నిఘాను మరింత పటిష్టం చేస్తాం.

-ఎస్పీ కేవీ మహేశ్వరరరెడ్డి

సమస్యలు పరిష్కరించే వరకూ కదలం



- ఆర్డీవోకు తేల్చిచెప్పిన మూలపేట గ్రామస్థులు
- సమస్యలు ఏకరువు పెట్టిన నిర్వాసితులు

6లో

ఆర్డీవో కృష్ణమూర్తికి సమస్యలు వివరిస్తున్న మాజీ సర్పంచ్ జీరు భీమారావు

ఇచ్ఛాపురానికి జలయోగం



- ఆ 357 గ్రామాలకు తాగునీటికి రూ.106 కోట్లు
- జల్‌జీవన్ పథకానికి మోక్షం
- వైసీపీ హయాంలో ప్రకటనలకే పరిమితం

విద్యార్థులకు తోడుగా ఆర్టీసీ

- పల్లెవెలుగు బస్సులకు ఉచిత, రాయితీ పాసులు

6లో

ఎయిర్‌పోర్టు నిర్మాణంతో అభివృద్ధికి అవకాశం

- ఆర్డీవో వెంకటేష్
- పెద్దబిడిమిలో అభిప్రాయ సేకరణ

6లో

కారులో 5కేజీల బంగారం

- విశాఖకు తరలిస్తూ పట్టుబడిన వైనం
- రూ.5.40 లక్షలు కూడా ..

7లో

కంచిలిలో భారీ చోరీ



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

8లో

ఇచ్ఛాపురానికి జలయోగం



జల్‌జీవన్ మిషన్ పనులు జరుగుతున్న దృశ్యం

- 357 గ్రామాలకు తాగునీటికి రూ.106 కోట్లు
- జల్‌జీవన్ పథకానికి మోక్షం
- వైసీపీ హయాంలో ప్రకటనలకే పరిమితం

ఇచ్ఛాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి)

ఇచ్ఛాపురం నియోజకవర్గంపై కూటమి ప్రభుత్వం మరోసారి కరుణచూపింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తాగునీటి సౌకర్యం కోసం రూ.106 కోట్లు కేటాయించింది. వైసీపీ హయాంలో జల్‌జీవన్ మిషన్ పథకం అంటూ హడావుడి చేసింది. కానీ కేవలం 23 గ్రామాలకు నీరు ఇప్పించి.. మిగతా వాటిని విస్మరించింది. ఇప్పుడు నియోజకవర్గంలోని మిగతా 357 గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి, పైపులైన్, తాగునీటి ట్యాంకులు నిర్మించేందుకుగాను ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీనిపై నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● కాలయాపనతో సరి..

వైసీపీ హయాంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని 380 గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని భావించింది. కానీ కేవలం 23 గ్రామాలకు మాత్రమే కుళాయిలను ఏర్పాటు చేయగలిగారు. సంబంధిత కాంట్రాక్టర్ మధ్యలో పనులు నిలిపివేశారు. అప్పట్లో బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో కాంట్రాక్టర్ పనుల నుంచి వైదొలిగారు. దీంతో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ పథకం ప్రశ్నార్థకమైంది.



మకరాంపురం వద్దనున్న పంపింగ్ స్టేషన్

దీనిపై ప్రభుత్వ విప్ బెందాళం అశోక్.. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. చంద్రబాబు సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. దీంతో ప్రభుత్వం స్పందించి మిగతా పనులు చేయించేందుకు రూ.106 కోట్లు మంజూరు చేసింది. కేంద్రం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించనున్నాయి.

కొత్త ట్యాంకులు సైతం..

ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం ద్వారా నియోజకవర్గానికి తాగునీరు అందించనున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా 248 చోట్ల ట్యాంకులు నిర్మిస్తారు. 105 మార్గాల్లో పైపులైన్లు వేస్తారు. ఉద్దానం నీటిని ఈ ట్యాంకులకు అనుసంధానించి ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు అందిస్తారు. కవిటి మండలంలో రూ.38.63 కోట్లతో 104 ట్యాంకులు, 10 పైపులైన్ మార్గాలను ఏర్పాటు చేస్తారు. కంచిలి మండలంలో రూ.33.83 కోట్లతో 95 ట్యాంకులు.. సోంపేట మండలంలో 40 ట్యాంకులు, 24 పైపులైన్ మార్గాలు...ఇచ్ఛాపురం మండలంలో రూ.12.94 కోట్లతో 9 ట్యాంకులు, 35 పైపులైన్ మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. త్వరలో ఆన్‌లైన్‌లో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు.

● ఆనందంగా ఉంది..



ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించాలన్నదే లక్ష్యం. వైసీపీ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకాన్ని పూర్తి చేయడంలో విఫలమైంది. దానిని పూర్తిచేయాలన్న సంకల్పంతోనే కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విన్నపాలు చేశాం. రూ.106 కోట్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది.

-బెందాళం అశోక్, విప్

విద్యార్థులకు తోడుగా ఆర్టీసీ

- పల్లెవెలుగు బస్సులకు ఉచిత, రాయితీ పాసులు

నరసన్నపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలలు తెరుచుకున్నాయి. పట్టణాల్లోని విద్యాసంస్థలకు వెళ్లేందుకు గ్రామీణ ప్రాంత పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రయాణ ఖర్చు భారంగా మారుతోంది. అటువంటి విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ అందిస్తున్న రాయితీ పాసులు వరంగా మారాయి. పదో తరగతి లోపు చదువుతున్న విద్యార్థినులు, 12 సంవత్సరాల లోపు విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ ఇతర కోర్సులు చదువుకుంటున్న విద్యార్థులకు రాయితీ పాసులు ఇస్తున్నారు. ఆర్టీసీలో రాయితీ పాసులు పొంది ప్రయాణిస్తున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా నగదు చెల్లిస్తుంది.

రాయితీ పాసుల రుసుం వివరాలిలా..

దూరం (కి.మీ.)	నెలకు (రూ.లలో)	3 నెలలకు (రూ.లలో)
0-5	140	400
5-10	190	555
10-15	240	705
15-20	310	930
20-25	400	1,185
25-30	435	1,290
30-35	475	1,410
35-40	565	1,680
40-45	645	1,920
45-50	735	2,190

దరఖాస్తు ఇలా...

ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత,రాయితీతో ప్రయాణించాలంటే విద్యార్థులు ముందుగా పాసులు పొందాలి. సంబంధిత ఆర్టీసీ బస్సు పాస్ కౌంటర్లలో వాటిని జారీ చేస్తారు. ఉచిత పాస్‌లు పొందాలనుకునే వారు ఆధార్ కార్డు, పాఠశాలలో హెచ్‌ఎం ఇచ్చే స్టడీ సర్టిఫికెట్‌తో కౌంటర్ వద్దకు వెళ్లాలి. రాయితీ పాసులకు ఇంటర్ విద్యార్థులు ఆధార్ కార్డు, పదో తరగతి హాల్ టిక్కెట్‌ను దరఖాస్తుతో పాటు జత చేయాలి. ఆపై తరగతులు చదివేవారు ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాళ్ల సర్టిఫికెట్లు అందజేయాలి. వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోచ్చు. 5 కిలోమీటర్ల పరిధి నుంచి 50 కిలోమీటర్ల వరకు రాయితీ పాసులను అందిస్తోంది. గతంలో నెలకోసారి విద్యార్థులు పాసులను రెన్యూవల్ చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు మూడు నెలల వరకు కూడా పొందవచ్చు.

సమస్యలు పరిష్కరించే వరకూ కదలం

- ఆర్డీవోకు తేల్చిచెప్పిన మూలపేట ప్రజలు
- కష్టాలు ఏకరువు పెట్టిన నిర్వాసితులు

నంతబొమ్మాళి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించే వరకు గ్రామాన్ని విడిచివెళ్లే ప్రసక్తే లేదని మూల పేట గ్రామస్తులు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తికి తేల్చి చెప్పారు. మంగళవారం పోర్టు పునరావాస గ్రామమైన మూలపేట వాసులతో ఆర్డీవో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నిర్వాసితులు మాట్లాడుతూ ముందుగా భూములు ఇచ్చిన వారికి ఎకరాకు రూ. 25 లక్షలు చెల్లించారని... ఇప్పుడు అదే ఎకరాకు అద నంగా రూ. పది లక్షల వంతున చెల్లించారని తెలిపారు. అందరికీ సమన్యాయం చేయాలని కోరారు. పోర్టు యాజమాన్యం నిర్మించిన బ్రిడ్జిని తొలగిస్తున్నారని తెలిపారు. తాము నౌపడ ప్రాంతానికి వెళ్లే రహదారిలో పోర్టు వాహనాలు నడుపుతున్నారని... దీని వల్ల బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పదిమందికి పైగా గర్భిణులు ఉన్నారని... వైద్యం కోసం బయటకు వెళ్లాలంటే రహదారి అధ్వానంగా ఉందని తెలిపారు. గ్రామం విడిచి వెళ్లేంత వరకైనా రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. అనంతరం ఆర్డీవో గ్రామంలో ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ హేమచంద్రరావు, ఎంపీడీవో జయంత్ ప్రసాద్, టెక్కలి సీఐ శ్రీనివాసరావు, నౌపడ, సంతబొమ్మాళి ఎస్.ఐ.లు నారాయణ స్వామి, సింహాచలం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరి కొందరు ఏమన్నారంటే...

- పోర్టు వల్ల తన 360 జీడి మొక్కలు చనిపోయాయని కేవలం... అరవై మొక్కలకు మాత్రమే పరిహారం ఇస్తున్నారని రైతు శిల్లా అప్పలస్వామి వాపోయారు. దీనిపై ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లినా తెలిపారు.
- తన భూమిని సర్వే చేయిస్తే 66 సెంట్లు ఉన్నట్టు తేల్చారని.. తీరా పోర్టు పరిహారం 33 సెంట్లకు మాత్రమే ఇచ్చారని... పశువుల శాలలు, చెట్లకు పరిహారం అందలేదని.. తనకు న్యాయం చేయాలని జీరు చిరంజీవి కోరారు.
- తన ఇంటి అంచనా తక్కువగా రికార్డు చేశారని.. మళ్లీ అంచనా వేయాలని జీరు చిన్నారావు కోరారు.
- గ్రామంలోని 11 మంది ఆర్మీ ఉద్యోగులకు పీడీఎఫ్ కింద రూ.9లక్షల 90 వేలు ఇస్తామని చెప్పారని... దాంతో తాము అంగీకార పత్రం ఇచ్చామని ఆర్మీ ఉద్యోగి జీరు వెంకటరెడ్డి తెలిపారు. తీరా ఇప్పుడు తమ కు రూ.4 లక్షల 70 వేలు ఇస్తున్నారని... న్యాయం చేయాలని కోరారు.
- తమకు పీడీఎఫ్‌ల డబ్బులు ఇంత వరకు జమ కాలేదని ద్వారాపు మోహన్, జీరు రాజులు, మంగ పొట్టన్న, జీరు రమేష్, పరపటి రాజు, జీరు రాజులు ఆవేదన వ్యక్తం చేశారు.

అంతవరకూ కదిలేది లేదు..

తమ సమస్యలన్నీ పరిష్కారమయ్యేంత వరకు గ్రామాన్ని విడిచి వెళ్లేది లేదని మండల టీడీపీ అధ్యక్షుడు, మూలపేట మాజీ సర్పంచ్ జీరు భీమారావు స్పష్టం చేశారు. గ్రామంలో 430 ఇళ్లకు రీ సర్వే చేపట్టాలన్నారు. ఇంటి నిర్మాణాలకు అదనంగా రూ.ఆరు లక్షల వంతున చెల్లించాలని కోరారు. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కాంట్రాక్టులు ఇస్తామని చెప్పారని.. తీరా ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. తమ గ్రామానికి చెందిన 22 సమస్యలు చదివి వినిపించారు. ఇవి పరిష్కారమైతేనే పునరావాస కేంద్రానికి వెళతామని... అంత వరకు గ్రామాన్ని వీడేది లేదని జీరు భీమారావు స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

అన్ని సమస్యలూ పరిష్కరిస్తాం..

మూలపేట గ్రామస్తుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి అన్నారు. సమస్యలు పరిష్కరించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారన్నారు. పది రోజుల్లో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తామన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. అన్ని సమస్యలు తీర్చిన తర్వాతే గ్రామాన్ని ఖాళీ చేయిస్తామని ఆర్డీవో కృష్ణమూర్తి హామీ ఇచ్చారు.



కిట్టాలపాడులో నిర్మిస్తున్న ట్యాంక్

కిడ్నీ వ్యాధి కబళిస్తోంది

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న నర్సింగపల్లి పాఠశాల వద్ద బోరు తీశారు. అక్కడి నుంచి గ్రామంలో ట్యాంకు ద్వారా శుద్ధ జలాన్ని ఇంటింటికీ సరఫరా చేయనున్నారు.

ఆటోచార్జీలకే సరి..

గ్రామంలో కిడ్నీ బాధితులు పెరుగుతుండడంతో భయమేస్తోంది. గత రెండేళ్ల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాను. గతంలో 108 వాహనం ద్వారా డయాలసిస్‌కు వెళ్లేవాడిని. ప్రస్తుతం అంబులెన్స్ రావడం లేదు. నెలకు ఐదుసార్లు డయాలసిస్‌కు టెక్కలిలో ఆస్పత్రికి వెళ్తున్నాను. ఆటో చార్జీలకే రూ.5వేలు ఖర్చవుతోంది. పింఛన్ వచ్చినా డబ్బులు చాలడం లేదు.

-మెండబోయిన సోమేశ్వరావు, కిట్టాలపాడు

అప్పు చేసి వైద్యం..

నా భర్త కొన్నేళ్ల నుంచి కిడ్నీవ్యాధితో బాధపడుతుండేవాడు. అప్పు చేసి వైద్యం చేయించాం. అయినా ఫలితం లేకపోయింది. గత నెల మృతి చెందాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వితంతువు పింఛన్ అయినా మంజూరు చేయాలి.

-ఎం.ధనలక్ష్మి, కిట్టాలపాడు

తాగునీరు వల్లే..

కొన్నేళ్ల నుంచి తాగునీటి సమస్య వల్లే గ్రామంలో కిడ్నీవ్యాధి బాధితులు పెరుగుతున్నారు. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికైనా శరవేగంగా పనులు పూర్తిచేసి.. మంచినీటిని సరఫరా చేయాలి.

-తలగాపు అప్పయ్య, కిట్టాలపాడు

డ్రోన్లతో డేగకన్ను

(ఐదో పేజీ తరువాయి)

నుంచి ఇప్పటివరకు జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై 250 కేసులు నమోదు చేశారు. శ్రీకాకుళం మండలంలో కోడి పందాలు నిర్వహిస్తున్న ఒక ముఠాను పట్టుకున్నారు. నగర శివారులో పేకాడుతున్న పది స్థావరాలను డ్రోన్ల ద్వారా గుర్తించి పది కేసులను నమోదుచేశారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలోనే సుమారు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 240 కేసులను నమోదు చేశారు. అలాగే విశాఖ వంటి నగరాల్లో డ్రోన్లను ఉపయోగించి హెల్మెట్ ధరించకపోవడం, సిగ్నల్ జంపింగ్, నెంబర్ ప్లేట్లు లేకపోవడం, రాంగ్ పార్కింగ్ వంటి వాటికి చలానాలు విధిస్తున్నారు. మన జిల్లాలో కూడా ఈ దిశగా పోలీసులు అడుగులు వేస్తున్నారు.

పీఏసీఎస్‌లకు పాలకవర్గాలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

శ్రీకాకుళం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ పరపతి సంఘాలకు (పీఏసీఎస్) పాలక వర్గాలను ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో ఒక్కో పీఏసీఎస్‌కు ఒక్కో చైర్‌పర్సన్‌ను, ఇద్దరు చొప్పున పర్సన్‌లను నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులను జారీ చేశారు.

చైర్‌పర్సన్‌లు, పర్సన్‌లు వీరే..

పీఏసీఎస్	చైర్‌పర్సన్	పర్సన్‌లు
అరసవల్లి	సింతు సుధాకర్	పేడాడ రామారావు, కలగ శివకుమార్
అంపోలు	గొండు వెంకటరమణమూర్తి	బూసి రమేష్, కొర్ను లక్ష్మీనారాయణ
తూలుగు	కొయ్యాన చంద్రశేఖరరావు	కల్లి ఎర్రన్న రెడ్డి, చెన్న రమణ
కృష్ణాపురం	సిమ్మ మహాదేవి	బెండి దశరథ, మామిడి చిన్నారావు
ఎల్.ఎన్.పేట	కాగాన మన్మథరావు	యరబాటి రాంబాబు, కొయ్యాన శ్రీనివాసరావు
పొందూరు	వండాన మురళి	కింజరాపు వెంకటరమణ, దుంపల సత్యం
బూర్జ	బగాది శ్రీరామమూర్తినాయుడు	ఉట్టి లక్ష్మణమూర్తి, దేవాడ శ్రీనివాసరావు
నరసన్నపేట	ఇస అప్పారావు	బండి పాపారావు, సరిపల్లి మధుసూదనరావు
చల్లవానిపేట	దుంగ స్వామినాయుడు	కూన వీరన్నాయుడు, రెడ్డి జయరాం
అల్లాడ	వెలమల చంద్రభూషణరావు	సనపల రామ్‌జీ, కొబగాపు వెంకటరావు
పోలాకి	భైరి భాస్కరరావు	రామకృష్ణారావు తార, పూజారి లచ్చన్న
వజ్రపుకొత్తూరు	కణితి వీవీ సురేష్ చౌదరి	కొత్తూరు అప్పారావు, రాపాక శాంతమూర్తి
పాతపట్నం	బండి రవివర్మ	సిరిపురం గంగాధరరావు, కల్లా కృష్ణారావు
కొనమాల	సలాన మోహనరావు	ధర్మాన బరికి, కవిటి రామస్వామి
హిరమండలం	గొల్ల సింహాచలం	కరణం శశిభూషణరావు, గంగు మాధవరావు
బుడితి	పొన్నాన బాలకృష్ణ నాయుడు	మెండ సూర్యనారాయణ, బోర ధనంజయనాయుడు
ఇచ్ఛాపురం	పెడిని బాబ్జీ రెడ్డి	గిన్ని బాలరాజు, బాసి భారతి
కవిటి	యర్రా బాసుదేవ్ ప్రధాన్	సిందుల గున్నయ్య, బోగిడియ భూదేవి
కంచిలి	పైలా పురుషోత్తం రెడ్డి	కిషోర్ పాడి, డొక్కరి మహాలక్ష్మి
మందస	తమిరియ్య భాస్కరరావు	కద్రక హరికృష్ణ, పిన్నింటి వాసు
బాలిగాం	లబ్బ రుద్రయ్య	గున్న రామారావు, సప్ప జీవనరావు
కొత్తకోట	శివ్వాల సూర్యనారాయణ	పైడి మురళీమోహన్, తర్లాడ సరోజనమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేష్

ఎయిర్‌పోర్టు నిర్మాణంతో అభివృద్ధికి అవకాశం

- ఆర్డీవో వెంకటేష్ ● పెద్దబిడిమిలో అభిప్రాయ సేకరణ

హరిపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశం కలుగుతుందని ఆర్డీవో వెంకటేష్ అన్నారు. మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణ గ్రామమైన పెద్దబిడిమిలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఆర్డీవో వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల ఈ ప్రాంతానికి కలిగే లాభాలను, యువతకు వచ్చే ఉద్యోగావకాశాలను వివరించారు. ఈ ప్రాంతంలో భూముల ధరల పెరుగుదలతోపాటు వివిధ రకాల కంపెనీలు వచ్చే అవకాశం ఉన్నందున శరవేగంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తీర ప్రాంతం గుండా జాతీయ రహదారితోపాటు అన్ని రకాల సౌకర్యాలు లభించనున్నట్లు తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీతోపాటు అన్ని రకాలుగా ఆదుకుంటుందని తెలియజేశారు. గ్రామస్థులు, వివిధ వర్గాల నాయకులు పాల్గొని తమ సమస్యలను విన్నవించుకున్నారు. అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో అన్నారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ తిరుపతిరావు, ఎస్ఐ కృష్ణప్రసాద్, తహసీల్దారు శ్రీకాంత్, జత్తు కూర్మారావు, లబ్బ రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ పెట్టెలో ఏముంది?

(ఐదో పేజీ తరువాయి)

చేయించారు. అందులో బంగారం, వెండి ఆభరణాలతోపాటు తడిసి ముద్దయిన నగదు కూడా బయట పడినట్లు సమాచారం. కాగా ఆసామి బంగారం, వెండి ఆభరణాలను భద్రపరిచి.. ఖాళీ పెట్టెను గ్రామానికి తీసుకొచ్చాడు. అందులో ఇనుప వస్తువులే ఉన్నాయని గ్రామస్థులకు చెప్పి.. దానిని ఉల్లిపాయలు విక్రయించేవాడికి ఇచ్చేశాడు. దీనిపై ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు మరింత ఆరా తీయగా.. జాలర్లకు వలలో చిక్కిన ఇనుప పెట్టే సురంవరంలో చోరికి గురైనదిగా గుర్తించారు. అందులో ఉన్న వెండి, నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే నగదు నీటిలో తడిసిపోవడంతో పోయినట్లు చెబుతున్నారు. ఏదిఏమైనప్పటికీ చోరికి గురై నదిలో దొంగలు పడేసిన ఇనుప పెట్టె జాలర్లకు దొరికి.. ఎక్కడెక్కడకో తిరిగి.. పోలీసుస్టేషన్‌కు చేరడం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై సీఐ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా జాలర్లకు దొరికిన పెట్టెలో నగదు, కొన్ని ఆభరణాలు ఉన్న మాట వాస్తవమేనన్నారు. త్వరలో పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

శుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరం

- మండలంలో కేంద్ర బృందం పర్యటన

కొత్తూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అలవాటైతే... ఆరోగ్యం సంపదగా మారుతుందని జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్(ఎస్ఎస్‌జీ) బృందం సభ్యులు పుణ్యశ్రీ అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే శతశాతం పరిశుభ్రత సాధ్యపడుతుందని చెప్పారు. స్థానిక అధికారులు ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు తమ వంతుగా కృషి చేసి ... కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి చేరువయ్యేలా చూడాలన్నారు. మంగళవారం కొత్తూరు మండలం నేరడిలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2025 ఇంటింటి సర్వేను ఎస్ఎస్‌జీ బృందం పరిశీలించింది. ఇంటింట మరుగుదొడ్ల వాడకం, తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరిస్తున్నారా లేదా అని ప్రజలను ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, ఆరోగ్య కేంద్రం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన తదితర అంశాలను పరిశీలించారు. నేరడితో పాటు సిరుసువాడ పంచాయతీలో ఇంటింటి సర్వేను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు ఎంపీడీవో నీరజ అధికార బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వసంత కుమారి, రిసోర్సు పర్సన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న కేంద్ర బృంద సభ్యులు

కారులో 5 కేజీల బంగారం



పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

- విశాఖకు తరలిస్తూ పట్టుబడిన వైనం
- రూ.5.40 లక్షల నగదు కూడా స్వాధీనం

రణస్థలం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నుంచి విశాఖపట్నంకు కారులో తరలిస్తున్న 5కేజీల బంగారు ఆభరణాలు, రూ.5.40 లక్షల నగదు జేఆర్ పురం పోలీసులకు పట్టుబడ్డాయి. సోమవారం రాత్రి శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద సీఐ ఎం.అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. విశాఖపట్నానికి చెందిన కె.శ్రీనివాసరావు, ఎ.రాజయ్య, కె.సూర్య ప్రయాణిస్తున్న కారును తనిఖీ చేయగా.. అందులో బంగారు ఆభరణాలు, నగదు లభ్యమైంది. వాటికి సంబంధించి బిల్లులు, ఆధారాలు చూపించకపోవడంతో జీఎస్టీ అధికారులకు అప్పగించామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆ ముగ్గురు సోమవారం ఉదయం నరసన్నపేట వెళ్లి కొంత బంగారం విక్రయించారని, రాత్రి తిరిగి విశాఖ వెళ్తుండగా తమకు పట్టుబడ్డారని అన్నారు. పట్టుబడిన బంగారు ఆభరణాల విలువ రూ.5కోట్లు ఉంటుందని జీఎస్టీ అధికారి వెంకటరమణ.. 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బిల్లులో కొంతమేర తేడా ఉన్నట్టు గుర్తించామని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తామని చెప్పారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదు

న్యూస్ బాక్స్

హత్యాయత్నం నేరానికి నాలుగేళ్ల జైలు

శ్రీకాకుళం లీగల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం, గృహహింస కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిస్సా రాష్ట్రం గుణుపూర్‌కు చెందిన నిర్మలకు మందస ప్రాంతానికి చెందిన పాలక సూర్యారావుతో 23 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా సూర్యారావు తన భార్యపై అనుమానంతో శారీర కంగా, మానసికంగా హింసిస్తూ హత్యాయత్నానికి ప్రయత్నించాడు. దీనిపై బాధితురాలు 2018లో మందస పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాక్షుల విచారణానంతరం పాలక సూర్యారావు పై నేరం రుజువు కావడంతో సోం పేట అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి జె.శ్రీని వాసరావు తీర్పునిచ్చారు. అప్పటి మందస ఎస్ఐ వై.రవి కిరణ్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేయగా అడిషనల్ పీపీ దువ్వ జగన్నాథం వాదనలు వినిపించారు.

పాఠశాలకు బెల్ అందజేత

కంచిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం ప్రభుత్వ పాఠశాలకు పూర్వవిద్యార్థులు ఎలక్ట్రానిక్ ఆటోమేటిక్ బెల్‌ను మంగళవారం హెచ్‌ఎం ఎస్.శారదకు అందజేశారు. కార్యక్రమంలో రాపాక దాలయ్య, బొట్టా వేణు, యర్రా పురుషోత్తం, ఉపాధ్యాయుడు నల్లాన రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఆమదాలవలస, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. మోనింగి వారి వీధి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డి.సురేష్, జి.సాయికిరణ్ విద్యార్థులను, రోగులను పరీక్షించారు. విద్యార్థులకు ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యాం సుందర్, అధ్యాపకులు రేవతి, పద్మ, పుష్ప, పెంటయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

సరుబుజ్జిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన కూన రవికుమార్ అన్నారు. మంగళవారం పెద్దపాలెం, పాలవలస గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కల నాటడంపై తీసుకుంటున్న చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పావని, ఈసీ రమాదేవి, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, కరణం రాజబాబు, తాడేలా రాజారావు, అంబళ్ల రాంబాబు, జనసేన అధ్యక్షులు పైడి మురళీ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

బూర్జ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఆనెపు రామకృష్ణంనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతిరావు, ఎంపీటీసీ పోలినాయుడు, సర్పంచ్‌లు అనూరాధ, కొరికాన రాజు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.


కూరుకుపోయిన లారీ



రోడ్డు గోతిలో కూరుకుపోయిన లారీ

బూర్జ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కొల్లివలస-నారాయణపురం మార్గంలో మంగళవారం రోడ్డు గోతుల్లో లారీ కూరుకుపోయింది. ఈ రహదారి గుండా ఇసుక రీచ్‌కు వందలకొద్ది లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు పాడైంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మోకాలి లోతు గుంతలు ఏర్పడి రోడ్డు దారుణంగా తయారవగా ఇసుకతో వెళుతున్న లారీ కూరుకుపోయింది.

అలరించిన 'సీతా కల్యాణం'



శ్రీకాకుళం కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిరంలో శ్రీ సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన కాకర్ల హనుమంతరావు భాగవతార్ 'సీతా కల్యాణం' హరికథ అలరించింది. హరికథ నవరత్నాలు లో భాగంగా మూడోరోజు ఈ కార్యక్రమంలో భాగవతార్‌ను సంస్థ అధ్యక్షుడు ఇప్పిలి శంకర శర్మ సత్కరించారు. కొంక్యాన మురళి, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో బయటపడ్డ విభేదాలు

- రెండు గ్రూపులుగా వైఎస్ జయంతి

ఆమదాలవలస/పొందూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీలో వర్గ విభేదాలు మరోసారి బయట పడ్డా యి. ఆ పార్టీ అధికారం కోల్పోయిన తరువాత నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. మంగళవారం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి కార్యక్రమాన్ని నియోజకవర్గంలో రెండు వర్గాలుగా విడిపోయి చేపట్టడంపై ఆ పార్టీ కార్యకర్తల్లోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. నియోజకవర్గ ఇన్‌చార్జిగా చింతాడ రవికుమార్‌ను అధిష్టానం నియమించిన నాటి నుంచి అగ్నికి ఆద్యం పోసినట్లయింది. పార్టీలో నాయకులు, కార్యకర్తలు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, చింతాడ రవికుమార్ వర్గాలుగా చీలిపోయి పార్టీ కార్యక్రమాలు చేపట్టడంపై విమర్శలు వినిపిస్తు న్నాయి. చింతాడ రవికుమార్ నిర్వహించే కార్యక్రమాలకు కొందరు, సీతారాం నిర్వహించే కార్యక్రమాలకు మరికొందరు హాజరవుతున్నారు. దీంతో తటస్థంగా ఉన్న నేతలు, కార్యకర్తలు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ఎవరి కార్యక్రమానికి వెళితే ఎవరికి కోపమొస్తుందోనని హడలిపోతున్నారు.

నియోజకవర్గంలోని ఆమదాలవలస, బూర్జ, పొందూరు మండలాల్లో ఇరువర్గాల వారు వేర్వేరుగా నిర్వహించారు. సరుబుజ్జిలిలో రవికుమార్ వర్గం నిర్వహించారు. దీంతో కొందరు రెండు కార్యక్రమాలకు హాజ రుకాగా మరికొందరు ఆయా వర్గాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తటస్థంగా ఉన్న వారు మాత్రం పార్టీలో పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు.

మహిళల ఆగ్రజ్వాలలో వైసీపీ ఖతం ఖాయం

- ఎమ్మెల్యే రవికుమార్



మాట్లాడుతున్న కూన రవికుమార్

ఆమదాలవలస, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో వైసీపీ ఆవిర్భావం నుంచీ మహిళలపై దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, వారి ఆగ్రహ జ్వాలల్లో ఆ పార్టీ ఖతం కావడం ఖాయమని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకుడు చంద్రశేఖర్ యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలో మహిళా ఎమ్మెల్యేపై వైసీసీ సైకో నల్లపు రెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడిన తీరు మహిళా లోకం సిగ్గుపడేలా ఉందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రాజును బట్టే రాజ్యం, ప్రజలు నడుస్తారని, గత ఐదేళ్లలో మహిళలపై దాడులు, అవమానకర సంఘటనలు వైసీపీ శ్రేణులు చేసినప్పటికీ జగన్ రెడ్డి ఏనాడూ వారిని వారించకపోవడంతో ఆ పార్టీలో అందరూ వాటినే కొనసాగిస్తున్నారని విమర్శించారు. ద్వాపర యుగంలో కౌరవులు ద్రౌపదిని అవమానిస్తే అంధుడైన ధృతరాష్ట్రుడిలా ప్రస్తుతం జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరు ఉందన్నారు. ఇప్పటికైనా వైసీపీ శ్రేణులు మహిళలపై దాడులు, అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

'అన్నదాత సుఖీభవ'కు నమోదు చేసుకోండి

ఇచ్ఛాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భవానీ శంకర్ అన్నారు. మంగళవారం కొఠారి, బూర్జుపాడు గ్రామాల్లో 'పొలంపిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ సాగులో కాలిబాటలు తీసుకోవాలన్నారు. విత్తన శుద్ధిపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏవో పీవీవీ అజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోండి

సోంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల సేవలను రైతులు వినియోగించుకోవాలని ఏడీఏ టి.భవానీశంకరరావు తెలిపారు. పొత్రకొండ, కర్తలిపాలేం గ్రామాల్లో మంగళవారం 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భావితరాలకు స్ఫూర్తి స్మృతి వనం

- గాంధీ స్మారక నిధి రాష్ట్ర కన్వీనర్ రష్మి



రష్మికి జ్ఞాపిక అందిస్తున్న గాంధీ మందిర ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని గాంధీ స్మృతి వనం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని గాంధీ స్మారక నిధి రాష్ట్ర కన్వీనర్ జి. రష్మి అన్నారు. జిల్లా పర్యటనకు మంగళవారం వచ్చిన ఆమె స్థానిక శాంతినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గాంధీ మంది రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. పోరాటాల పురిటిగెడ్డగా పేరొందిన శ్రీకాకు ళంలో గాంధేయవాదాన్ని చాటి చెప్పేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ మందిరం ద్వారా భావితరాలకు గాంధీ భావజాలాన్ని అందించా లని కోరారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు మేడూరి ప్రసాదరావు, బరాటం లక్ష్మణరావు, వావిలపల్లి జగన్నాథం నాయుడు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గార ఎత్తిపోతలతో ఖరీఫ్‌నకు సాగునీరు



ఎత్తిపోతల పథకం పనులు పరిశీలిస్తున్న ఈఈ సుబ్రహ్మణ్యం

గార, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గారలో వంశధార నది వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి ఈ ఖరీఫ్ సీజన్‌కు సాగునీరందిం చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎస్ఐడీసీ ఈఈ కేవీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఎత్తి పోతల పథకం పనులను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ టెస్ట్ చేయడం జరిగిందని, ప్యానెల్ బోర్డు, మోటార్లు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. పథకాన్ని పూర్తి చేసి సాగునీరందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారన్నారు. ప్రస్తుతం నదిలో నీరు రావడంతో ఫుట్‌పాత్ పనులకు కొద్దిగా ఇబ్బందిగా ఉందని, నీరు తగ్గిన వెంటనే ఆ పనులు కూడా పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ ఎం.కామరాజు, ఏఈ బి.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వహించాలి



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న ఈఆర్వో పద్మావతి

ఇచ్ఛాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): బీఎల్వోలు విధులను చిత్తశుద్ధితో, సక్రమంగా నిర్వహించాలని ఈఆర్వో డి.పద్మావతి అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణను సద్వినియోగం చేసుకోవా లని కోరారు. 6 రోజుల పాటు నాలుగు మండలాల బీఎల్వోలకు శిక్షణ ఇచ్చి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన బీఎల్వో లకు సర్టిఫికేట్లను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఎన్.వెంకటరావు, మురళీమోహన్, ఎన్.రమేష్, అప్పలస్వామి, ఎలక్షన్ డీటీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ తరగతులు

శ్రీకాకుళం రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నియోజకవర్గ బూత్ లెవల్ అధికారులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం శ్రీకాకుళం నియోజకవర్గ బీఎల్వోలకు రెవెన్యూ గెస్ట్ హౌస్ సమావేశ మందిరంలో వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, గార తహసీల్దార్లు ఎస్.గణపతిరావు, చక్రవర్తి, డిప్యూటీ తహసీల్దార్ జీకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, పొగాకు విక్రయిస్తే చర్యలు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలకు 100 మీటర్ల లోపు నిషేధిత గంజాయి, పొగాకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టంచేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ మేరకు 'ఆపరేషన్ సేఫ్ క్యాంపయిన్ జోన్' కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. ఇందులోభాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది, ఈగల్ టీం, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయంతో పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల దూరంలో ఉన్న కిరాణా దుకాణాల్లో సిగరెట్, ఖైనీ, గుట్కా, గంజాయి తదితర ఉత్పత్తుల అమ్మకాలు లేకుండా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఈ డ్రైవ్ ఐదు రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తా న్నారు. మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలతో పాటు విద్యార్థులకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించనున్నా మన్నా రు. నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గంజాయి వంటి మత్తు పదార్థాలు అమ్మకాలు చేపట్టేవారిపై చర్యలు తప్పవన్నారు.

ఘనంగా గ్రామదేవత సంబరం



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

సోంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జింకిభద్ర గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు భారీ ఊరేగింపు మధ్య ఆలయానికి చేరుకుని ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

గురుపూర్ణిమ ఉత్సవాలు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): బొందిలీపురంలోని షిర్డీ దర్బార్‌లో గురు పూర్ణిమ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మ ఆధ్వర్యంలో దుర్గాదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. షిర్డీసాయిని నూతన వస్త్రాలతో అలంకరించారు. సాయంత్రం జానపద నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

జీడి మొక్కల పంపిణీ

కంచిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పెద్దకొజ్జిరియా గ్రామంలో రైతులకు జీడి మొక్కలను మంగళవారం పంపిణీచేశారు. 14మంది రైతులకు 490 జీడి మొక్కలను ఎంపీడీవో వి.తిరుమలరావు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదిన రామారావు, సర్పంచ్ పొందల డిల్లీరావు, మాజీ సర్పంచ్ బొడ్డ రాంకుమార్, నాయకులు పిలక చినబాబు రెడ్డి, బొడ్డ హరిబాబు, ఏపీవో జి.ధనుంజయ, రైతులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



పైడిభీమవరంలో బైక్ ర్యాలీ చేపడుతున్న కార్మికులు

రణస్థలం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం చేపట్టనున్న అఖిల భారత సమ్మె జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం పైడిభీమవరం పారిశ్రామిక వాడలో బైక్ ర్యాలీ చేపట్టారు. ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, చాలీచాలని వేతనాలతో కార్మికులు దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారన్నారు. తక్షణం కార్మిక సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రతిభకు చిత్రలేఖనం పోటీలు దోహదం

జి.సిగడాం, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చిత్రలేఖనం దోహదం చేస్తుందని హెచ్‌ఎం ఆర్ఎల్ కుమారి అన్నారు. మంగళవారం పాలఖండ్యాం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ, రాష్ట్ర చిహ్నాలు, జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల చిత్రాలు, దేశభక్తుల చిత్రాలను వేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుదమ తిరుమలరావు, ఎందువ వెంకటరమణ, వి.రాము, ఎం.సుజాత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలు సందర్శన



జైలును పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం లీగల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అంపోలులోని జిల్లా జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అందిస్తున్న ఆహారం, జైలు పరిశుభ్రతలపై ఆరా తీశారు. అక్కడి ముద్దాయిలతో మాట్లాడుతూ.. న్యాయవాదిని నియమించుకొనే స్థోమతలేని వారికి ఉచితంగా న్యాయసహాయం అందిస్తామన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ఆయనతో పాటు జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ జి.మధుబాబు, జైలర్ దివాకర్ నాయుడు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ చీఫ్ కె.ఆఫీసునాయుడు, పి.అంజనీకుమార్ తదితరులున్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి పదవికి రాజీనామా

రణస్థలం, జూలై 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి గత 30 ఏళ్లుగా పనిచేసినా పార్టీలో సముచిత స్థానం ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్టు ముక్కు ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ రిజర్వేషన్ అయినప్పటికీ తన పేరును పరిశీలన చేయకపోవడం బాధాకరమన్నారు. తన రాజీనామా పత్రాన్ని మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడు లకు పంపించినట్లు తెలిపారు. పార్టీలో ఒక సామాన్య కార్యకర్తగా పనిచేస్తానని తెలిపారు.

పేదల గుండె చప్పుడు వైఎస్

అరసవిల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల గుండె చప్పుడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. వైఎస్ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి, ప్రధాన కార్యదర్శి సైదుల్లాఖాన్, ఎస్సీ జిల్లా సెల్ అధ్యక్షుడు తెంబూరు మధుసూదనరావు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పూడి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు..

శ్రీకాకుళం అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అందించి అందరి గుండెల్లో చిరస్మరణీయుడిగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి నిలిచారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైఎస్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఏడురోడ్ల జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రెడ్‌క్రాస్ భవనంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

- ఇచ్ఛాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైఎస్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ వద్ద వైఎస్ విగ్రహానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

జగన్ విమర్శించే హక్కు అచ్చెన్నకు లేదు..

రణస్థలం, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని విమర్శించే హక్కు మంత్రి అచ్చెన్నాయుడుకు లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎచ్చెర్ల నియోజకవర్గ వైసీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ నాయకుడిని విమర్శిస్తే గాజులు వేసికొని కూర్చోమన్నారు. కార్యక్రమంలో బెల్లాన చంద్రశేఖర్, గొర్లె కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసాద్

కొత్తూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వసపలో జరిగిన హత్యకేసులో నిందితుడు మనగాన శంకరావును అరెస్టు చేసినట్టు కొత్తూరు సీఐ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హత్యకు గురైన లుకలాపు మిన్నారావు(19) శనివారం రాత్రి మద్యం తాగి టిఫిన్ షాప్‌కి వెళ్లి శంకరరావుతో గొడవపడ్డాడు. వీరిద్దరి మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో శంకరావు సుత్తితో మిన్నారావు తలపై కొట్టడంతో పడిపోయాడు. కొనఊపిరితో ఉన్న మిన్నారావు బతికితే తనకు ముప్పు తప్పదన్న భయంతో అతడి గొంతుకోసి అతికిరాతంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రహదారికి అవతలి వైపునకు తీసుకెళ్లి పడేశాడు. హత్యకు ఉపయోగించిన సుత్తి, కత్తిని స్వాధీనం చేసుకున్నామని, నిందితుడ్ని కొత్తూరు కోర్టులో మంగళవారం హాజరు పరిచినట్టు సీఐ తెలిపారు. సీఐతో పాటు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ, ఏఎస్ఐ రాజేశ్వరావు, హెచ్‌సీ కోటి ఉన్నారు.

10 కిలోల గంజాయితో ఇద్దరు ఒడిశా వాసులు..


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రంబ ప్రాంతం నుంచి ఆ రాష్ట్రానికి చెందిన చెందిన ఇద్దరు వ్యక్తులు 10 కిలోల గంజాయిని బెంగుళూరు తరలిస్తుండగా పట్టుబడినట్టు సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం మడపాం టోల్‌ప్లాజా వద్ద ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ తనిఖీ చేస్తుండగా.. వేరొక వాహనంలో వచ్చిన బసంత మహాపాత్రో, సిద్ధాంత స్వాన్ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంటనే స్పందించిన పోలీసులు వారిద్దరి పట్టుకుని బ్యాగ్‌లు తనిఖీ చేశారు. అందులో 10కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు ఇరిద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎచ్చెర్ల, జూలై 8(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం ఫ్లై ఓవర్‌పై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాస్ దీక్షిత్ (52) విశాఖ జిల్లా ఆనందపురం నుంచి ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వస్తుండగా.. బైక్ అదుపు తప్పి పక్కన ఉన్న గోడను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. శ్రీనివాస్ దీక్షిత్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆరు నెలల కిందట బలగలో నివాసం ఉంటున్న తమ్ముడు శ్రీధర్ దీక్షిత్ ఇంటికి వచ్చి ఉంటున్నాడు. ఈనెల 6న ఆనందపురంలో ఉంటున్న మరో తమ్ముడు శ్రీకాంత్ దీక్షిత్ ఇంటికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. శ్రీనివాస్ దీక్షిత్ భార్య లక్నోలో ఉంటున్నారు. మృతుడి సోదరుడు శ్రీధర్ దీక్షిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంచిలిలో భారీ చోరీ

● 24 తులాల బంగారం, కిలో వెండి దొంగతనం


ధ్వంసమైన తలుపు లాక్

కంచిలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): కంచిలి మెయిన్‌రోడ్డులో ఓ రిటైర్డు ఉపాధ్యాయుడి ఇంట్లో శనివారం రాత్రి దొంగలు పడి 24 తులాల బంగారం, కిలో వెండి ఆభరణాలు దొంగిలించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. రిటైర్డు ఉపాధ్యాయుడు సింహాద్రి ప్రధాన్ శనివారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి విశాఖలోని బంధువల ఇంటి వెళ్లారు. ఆదివారం సాయంత్రం తిరిగి కంచిలి వచ్చి చూసేసరికి ఇంటి ప్రధాన తలుపులు రెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూశారు. బీరువాలోని సుమారు 24 తులాల బంగారు, కిలో వెండి వస్తువులు చోరీ జరిగినట్టు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వంగా సోంపేట సీఐ బి.మంగరాజుతోపాటు ఎస్ఐ పి.పారినాయిడు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పలాస నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా ప్యాకెట్లతో ఇద్దరు అరెస్టు

సోంపేట/కంచిలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం కుమ్మరి పేటకు చెందిన సాహుకారి కుమార్ 80 సారా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేసినట్టు సీఐ జీవీ రమణ తెలిపారు. ఇతనికి సారా సరఫరా చేసిన బొనమాలి గ్రామానికి చెందిన లక్ష్మిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే జలంత్రకోట గ్రామ శివారుల్లో నిర్వహించిన దాడుల్లో రత్నాల బైలోడు వద్ద నుంచి 200 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేశామన్నారు. వీరిని సోంపేట కోర్టులో హాజరు పరచినట్టు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ మధుకుమార్, సిబ్బంది భానుప్రసాద్, మార్కారావు, ఉమాపతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోటబొమ్మాళి, జూలై 8(కోటబొమ్మాళి): జాతీయ రహదారి సుబ్బారావుపేట జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మెళియాపుట్టి మండలం పొలూరు గ్రామానికి చెందిన సవర డిల్లేశ్వరావుకు, టెక్కలి మండలం పాతపట్నం గ్రామానికి చెందిన బొంతు శాంతి గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే శాంతి తన కుమార్తెను శ్రీకాకుళం కళాశాలలోని దింపేందుకు డిల్లేశ్వరావుతో కలిసి అతడి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. కుమార్తెను కళాశాలలో విడిచిపెట్టి తిరిగి వస్తుండగా సుబ్బరావుపేట జంక్షన్ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో వీరిద్దరూ గాయపడగా.. వారిని 108 వాహనంలో కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు బొంతు శాంతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సత్యనారాయణ మంగళవారం కేసు నమోదు చేశారు.

తప్పుడు కుల ధ్రువపత్రాలు ఇస్తే ఉద్యమమే

కాశీబుగ్గ, జూలై 8(ఆంధ్రజ్యోతి): బెంతుఒరియా కులం పేరుతో జిల్లాలో ఒక తెగ అబద్ధం ఆడుతూ.. గిరిజన కుల ధ్రువ పత్రాలు పొందాలని చూస్తున్నారని అదే జరిగితే ఉద్యమం తప్పదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అన్నారు. మంగళవారం కాశీబుగ్గలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో బెంతు ఒరియా అనే తెగ లేరని, ఇది తాము ఆదివాసీ వికాస్ పరిషత్ నేతలుగా చెప్పడం లేదని, అందుకు చారిత్రక ఆధారాలు ఉన్నాయని వివరించారు. పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలోని కంచిలి, కవిటి మండలాల్లో బీసీ-ఏకు చెందిన ఒడ్డి కులం వారు బెంతు ఒరియాలుగా చెప్పుకుని గిరిజన కుల ధ్రువపత్రాలు ఇవ్వాలని కొందరు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారని, వారికి ఇంటిగ్రేటెడ్ కోర్సు విద్య పూర్తి వరకు మాత్రమే వర్తించేలా ఇవ్వాలనే ఆదేశాలు ఇచ్చిందన్నారు. దానిని ఆసరాగా చేసుకొని తమను గిరిజనులుగా గుర్తించాలని రాజకీయ పార్టీ నేతలను కలిసి రాజకీయాలు చేస్తున్నారన్నారు. బెంతు ఒరియాల పేరుతో చలామణి అవుతూ ఇటు ప్రభుత్వాన్ని, అటు న్యాయస్థానాలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు కుల ధ్రువ పత్రాలు మంజూరు చేస్తే ఉద్యమిస్తామన్నారు. డీఎల్‌సీఎల్‌లో పెండింగ్‌లో ఉన్న నకిలీ కుల ధ్రువ పత్రాలపై తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన హక్కులను కాపాడేందుకు అధికారులు సహకిరించాలని కోరారు.ఈ సమావేశంలో శ్రీకాకుళం జేఏసీ కన్వీనర్ సవర రాంబాబు, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

నాడు నడకదారి.. నేడు పక్కా రోడ్డు

● ఎమ్మెల్యే కృషితో రహదారి సమస్య పరిష్కారం
● ఆనందం వ్యక్తం చేస్తున్న అల్లెన గ్రామస్థులు


నాడు గట్టుగా ఉన్న అల్లెన నడకదారి

ఆమదాలవలస, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి ఆ గ్రామం కేవలం మూడు కిలోమీటర్ల దూరమే. అయితే సరైనే రహదారి లేకపోవడంతో సుమారు 18 కిలోమీటర్లు ప్రయాణించి మండల కేంద్రానికి చేరుకునేవారు. కొంతమంది ఇంత దూరం ప్రయాణించలేక ఈ మూడు కిలోమీటర్లు కాలినడకన కాలువ గట్లు దాటుకుంటూ మండల కేంద్రానికి చేరుకుని తమ పనులు చేసుకునేవారు. ఇలా దశాబ్దాలుగా జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ క్రమంలో ఇక్కడి పరిస్థితిని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి రావడంతో ఆయన స్పందించి ఆ గ్రామస్థుల సమస్య పరిష్కారానికి కంకణం కట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్లే.. మండల కేంద్రం బూర్జకి కూతవేటు దూరంలోనే అల్లెన గ్రామం ఉంది. అయితే సరైన రహదారి లేకపోవడంతో సుమారు 18 కిలోమీటర్లు దూరం ప్రయాణించి రాకపోకలు సాగించేవారు. దీంతో ఆ గ్రామస్థులు తీవ్ర వ్యయ ప్రయాసలకు గురయ్యేవారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి వచ్చింది. దీంతో ఈ సమస్యను ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి.. ఈ రెండు గ్రామాల మధ్య రహదారి నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేయించారు. ఇప్పుడు ఆ రోడ్డు దాదాపుగా పూర్తికావచ్చింది. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని ఈ సమస్యకు ఎమ్మెల్యే రవికుమార్ చొరవతో చకచకా పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 70శాతం పూర్తి కావడంతో ఆ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కొత్తగా నిర్మాణం చేపడుతున్న పక్కా రహదారి

రహదారి సమస్యపై ప్రత్యేక దృష్టి

గత వైసీపీ పాలకులు పట్టించుకోకపోవడంతో రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. ఎన్నికలకు ముందు రహదారి సమస్యలు పలు గ్రామాల ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.250 కోట్లతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వీధి రహదారులతో పాటు కొన్ని గ్రామాలకు ప్రధాన రహదారులు నిర్మాణం చేపట్టాం. బూర్జ మండలం అల్లెన గ్రామ ప్రజల దీర్ఘకాలిక సమస్యలు ఉన్నా.. రహదారి కష్టాలను తీర్చేందుకు ప్రత్యేక దృష్టి సారించాను. వారి చిరకాల సమస్యకు పరిష్కారం చూపించాను.

- ఎమ్మెల్యే కూన రవికుమార్


నరసన్నపేట: ఉర్లాంలో ఎమ్మెల్యే రమణమూర్తి..


ఎల్ఎన్ పేట: యంబరాంలో ఎమ్మెల్యే గోవిందరావు..


ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న విప్ బెందాళం అశోక్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


సరుబుజ్జిలి: పాలవలసలో ఎమ్మెల్యే కూన రవికుమార్..


ఎచ్చెర్ల: లింగాలపేటలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్..


రణస్థలం: దేరసాంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు..


పలాస: పారసంబలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు తదితరులు..

మహిళలకు క్షమాపణ చెప్పాలి

పలాస, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత ప్రసన్నకుమార్‌రెడ్డి మహిళలపై చేసిన వ్యాఖ్యలు సరికాదని, దీనికి భేషరతుగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జగన్మోహన్‌రెడ్డి అండతోనే ప్రసన్నకుమార్‌రెడ్డి లాంటి వ్యక్తులు మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ఇటువంటి వ్యాఖ్యలకు తావలేదని, వారిపై చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

వంశధార కాలువ కబ్జా తొలగింపు

సంతబొమ్మాళి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇజ్జువరం పంచాయతీ పరిధి వంశధార కాలువ కబ్జా తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. నౌపడ రైల్వే గేటు సమీపంలో నౌపడ-టెక్కలి మెయిన్‌రోడ్డు పక్కన మాజీ ఎమ్మెల్యే మనవుడునంటూ సర్వే నెంబర్ 355-1ఈ, 355-1ఎఫ్‌లో వంశధార కాలువ కల్వర్టు కప్పేసి అక్రమ లే అవుట్ వేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై తహసీల్దార్ హేమసుందరావు, వంశధార డీఈ శ్రీధర్ స్పందించి కాలువ కబ్జాను పరిశీలించి తొలగించాలని ఆదేశించారు. దీంతో రియల్టర్లు మంగళవారం జేసీబీతో కప్పేసిన కాలువను పునరుద్ధరించారు.

ప్రోత్సాహకాలను రైతులకు వివరించాలి

పాతపట్నం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులకు వివరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో రాయితీపై ఇస్తున్న విత్తనాలను రైతులకు అందించారు. అనంతరం ఏవో పి.కిరణవాణి ఆధ్వర్యంలో బూరగాం రొంపివలసలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. టీడీపీ నేతలు పైల బాబ్జీ సైలాడ సతీష్, ఎ.సన్యాసి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీధరరాజా

పాతపట్నం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన ఉండాలని జడ్పీ సీఈవో శ్రీధరరాజా అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల బూత్ లెవెల్ అధికారుల శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలనా వ్యవస్థలను నిర్దేశించే ఎన్నికలు పారదర్శకంగా నిర్వాహణ జరపాలన్నారు. ఎన్నికల నిర్వాహణలో బీఎల్‌వోలదే క్రియాశీలక పాత్ర అని అన్నారు. వారం రోజులపాటు ప్రతీరోజూ 50మంది బీఎల్‌వోలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. తహశీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఎన్నికల డీటీ కె.నారాయనరావు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణల పరిశీలన

కొత్తూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కొత్తూరు కళాశాల రహదారి ఆక్రమణలు తొలగింపునకు అర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మంగళవారం కొత్తూరు అలికాం-బత్తిలి రహదారిలో గ్రామీణ బ్యాంకు నుంచి అంజనేయ ఆలయం వరకు ఇరువైపుల తహసీల్దార్ కె.బాలకృష్ణ, అర్అండ్‌బీ డీఈ సాగర్ పరిశీలించారు. రహదారి పనులకు సుమారు రూ.26లక్షలు మంజూరు కావడంతో ఆక్రమణలు గుర్తిస్తున్నారు. కాగా గతంలో పర్యటించిన ఎంపీ రామ్మోహన్, ఎమ్మెల్యే గోవిందరావుతోపాటు కలెక్టర్ దృష్టికి ఇక్కడి సమస్యను స్థానికులు వివరించడంతో రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయి.

అభివృద్ధి దిశగా అడుగులు

హిరమండలం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పరిపాలనలో గ్రామాలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. మేజర్ పంచాయతీ హిరమండలంలో మంగళవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.కామేశ్వరరావు, మల్లవరపు నాని, పి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ


రోగులకు పండ్లు, రొట్టెలు అందిస్తున్న బళ్ల గిరిబాబు, దువ్వాడ శ్రీధర్

పలాస, జూలై 8(ఆంధ్రజ్యోతి): దివంగతనేత వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మాజీ పీఏసీఎస్ చైర్మన్ దువ్వాడ శ్రీధర్, మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. అంతకు ముందు కాశీబుగ్గలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జుత్తు నీలకంఠం, గెర్లె వేణు, మరడ భాస్కరరెడ్డి, హేమాచలం పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై రైతులు దృష్టిసారించాలి

మెళియాపుట్టి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలపై రైతులు దృష్టిసారిస్తే మంచి లాభలు పొందవచ్చునని ఉద్యానవనశాఖ ఏడీ చిట్టిబాబు తెలిపారు. మంగళవారం కుడ్డబలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన పంటలు పండించే రైతులకు రాయితీని ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఆయిల్ పామ్ పంట ఒక్కసారి వేస్తే మూడేళ్ల పాటు ఆగితే 30 ఎళ్లు పాటు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్‌పండా, ఉద్యానవశాఖ అధికారులు శంకర్‌దాస్, శరత్‌రెడ్డి షన్ముఖరావు మాజీ ఎంపీపీ ఎస్.మోహనరావు తదితరులు ఉన్నారు.

పచ్చదనాన్ని కాపాడుకోవాలి

టెక్కలి రూరల్: జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు పచ్చదం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి తెలిపారు. మంగళవారం తోలుసురుపల్లి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రైతలకు ఉపాధి పథకం ద్వారా ఆదాయం ఇచ్చే మొక్కల నాటడడం వల్ల ఆదాయంతోపాటు పచ్చదనం పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కనకచలం, మెండ.దమయంతి, దల్లి.ప్రసాద్‌రెడ్డి, గున మన్మాధరావు, మదన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ఎల్ఎన్ పేట: జూలై 8(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ ఆర్. జ్యోతిలక్ష్మి, నాయకులు ఆర్.రామారావు, పి.విష్ణుమూర్తి అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. జి.యోగీశ్వరరావు, ఇ.చిన్నారావు, ఎల్.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడలో విద్యుత్ సమస్య తీర్చండి

పలాస, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంగిలిగాం జీడి పారిశ్రామిక వాడలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వ్యాపారాలు చేసుకోవడానికి కష్టంగా మారుతున్నాయని, తక్షణం పరిష్కరించాలని కోరుతు వ్యాపారులు విద్యుత్‌శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి కొంచాడ వినయ్, ఉపాధ్యక్షుడు తాళాసు శ్రీనివాసరావు, జామి రామ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలు వినియోగిస్తే జీవితం నాశనం

పలాస, జూలై 8(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు వినియోగిస్తే జీవితాలు నాశనం అవుతాయని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోడ్డులో ఉన్న షాపుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిఐ పి.సూర్యనారాయణ, సిబ్బంది, అధ్యాపకులు ఉన్నారు.

● నరసన్నపేట: విద్యాసంస్థలకు సమీపంలోగల పాన్‌షాపులు, కిరాణీ దుకాణాల్లో నిషేధించిన సిగరెట్లు, గుట్కాలు, గంజాయి తదితర వస్తువులు విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసరావు వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో పలు విద్యాసంస్థలు సమీపంలోగల పాన్ షాపులు, కిరాణీ షాపుల్లో ఈగల్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, ఈగల్ టీం సభ్యులు రాము, ఎంఈవో పి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

● పాతపట్నం: ఆపరేషన్ సేఫ్‌జోన్ కార్యక్రమంలో భాగంగా పాతపట్నంలోని ప్రధానరహదారికి ఇరువైపులా ఉన్న పాన్‌షాపులు వివిధ షాపులను మంగళవారం తనిఖీ చేపట్టారు. పలు విద్యా సంస్థల సమీపంలో గల షాపుల యజమానులకు పొగాకు, గుట్కా వంటి నిషేధిత ఉత్పత్తులు అమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ రెవెన్యూ సిబ్బందితోపాటు స్కూల్ వలంటీర్‌లు తదితరులు పాల్గొన్నారు.

● మెళియాపుట్టి: పాఠశాలలు, కళాశాలలకు వంద గజాల దూరంలో పొగాకు ఉత్పతులు, గంజాయి ఉత్పత్తులు అమ్మకం జరిపినా, నిల్వచేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌బాబు చెప్పారు. సేఫ్‌జోన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వివిధ ప్రదేశాల్లో దుకాణాలు తనిఖీ చేశారు.

● హరిపురం: మందస మండలం హరిపురం, మందస తదితర గ్రామాల్లో పాఠశాలలకు వంద మీటర్లు దూరంలోని దుకాణాల్లో ఎస్ఐ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఆయనతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల శ్రమదానం.. బాగుపడ్డ పాఠశాల ఆవరణ


పాఠశాల ఆవరణను బాగుచేస్తున్న తల్లిదండ్రులు

హిరమండలం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలలో వర్షం వస్తే అడుగు పెట్టలేని పరిస్థితి. ఆవరణ మొత్తం నీటితో, బురదదతో నిండి అధ్వానంగా ఉండేది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు స్పందించి హెచ్ఎం వేణగోపాలరావు సహకారంతో పాఠశాల ఆవరణను బాగు చేసుకున్నారు.

నేడు సీజీఆర్ఎఫ్ సదస్సు

టెక్కలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం సర్కిల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం సీజీఆర్ఎఫ్ సదస్సు నిర్వహించనున్నట్టు పరిష్కార వేదిక చైర్మన్, రిటైర్డు న్యాయాధికారి బి.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెక్కలిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు జరిగే ఈ సమావేశంలో వినియోగదారులు నేరుగా పాల్గొని తమ సమస్యలు తెలియజేసుకోవచ్చునన్నారు. అలాగే విశాఖ సీతమ్మధారలో గల ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వక ఫిర్యాదు చేయవచ్చునని, టోల్‌ఫ్రీ నెంబరు 1912ను సంప్రదించవచ్చునన్నారు. సదస్సుకు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు బి.సులేఖారాణి, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొంటారని తెలిపారు.

అందుబాటులో యూరియా, డీఏపీ

కోటబొమ్మాళి, జూలై 8(ఆంధ్రజ్యోతి): అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ రైతులకు అందుబాటులో ఉంచామని టెక్కలి ఏడీఏ కె.జగన్మోహనరావు అన్నారు. మంగళవారం చిట్టివలస గ్రామంలో ఏవో ఎస్.గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం రైతులకు రువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ టి.శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో నిర్వహిస్తున్న ఆర్‌డీఎస్ఎస్ పనుల కారణంగా బుధవారం బైరాగిపేట దశరధపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగునుందని విద్యుత్‌శాఖ టెక్కలి ఏఈ జి.శంకరరావు తెలిపారు. దీంతో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరపరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

భూములు ఇవ్వలేం

నరసన్నపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎం పార్కు నిర్మాణం కోసం 45 ఏళ్ల కిందట పభుత్వం ఇచ్చిన భూములు తిరిగి ఇవ్వలేమని జమ్ము గ్రామానికి చెందిన దళిత రైతులు అన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు వద్ద తమ నిరసన తెలిపారు. జమ్ము రెవెన్యూ పరిధిలోగల సర్వే నెంబరు 122-1 నుంచి 11 వరకు, 128-1 నుంచి 5 వరకు ల్యాండ్ సీలింగ్ భూములను ప్రభుత్వం జీవనం కోసం ఇచ్చారని, ఇప్పుడు పార్కు నిర్మాణం పేరుతో తీసుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు బమ్మిడి రామారావు, తలసముద్రం రాజారావు, తాడి ముఖలింగం, సతివాడ రాజేశ్వరి, చల్ల సూరమ్మ, కొంగరాపు త్రినాథ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ఎల్ఎన్ పేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొక్కలు పెంచడం వల్ల వాతావరణంలో పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. అనంతరం యంబరాం గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లే రహదారిని ప్రారంభించారు. బొడ్డవలస, గొట్టిపల్లి గ్రామాల్లో రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీదేవి, ఏవో కె.సింహాచలం, టీడీపీ నాయకులు ఎం.మనోహర్ నాయుడు, కె.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

నరసన్నపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటల అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. మంగళవారం దేవాది గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉద్యానవన మొక్కలు నాటే రైతులకు ఎకరాకు ప్రతీ ఏటా రూ.40 వేలు చొప్పున ప్రభుత్వ మూడేళ్లు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో బగ్గు అర్చన, శిమ్మ చంద్రశేఖర్, యాళ్ల వేణుగోపాలరావు, శిమ్మజగన్నాథం, ముద్దాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతు

టెక్కలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బుధవారం జరిగే సార్వత్రిక సమ్మెకు మోటార్ వర్కర్స్ యూనియన్ తమ మద్దతు తెలిపింది. కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌ను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని, అసంఘటిత కార్మికుల సంక్షేమం ప్రభుత్వమే బాధ్యత పడాలని, టెక్కలిలో కారు షెడ్లకు స్థలం కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. నంబూరు షణ్ముఖరావు, బొడ్డ కేశవ, శోభన్, తవిటయ్య, సోమేసు, కోదండ తదితరులు ఉన్నారు.

గ్రామాలు శుభ్రంగా ఉంచండి

నరసన్నపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా సూచించారు. మంగళవారం జమ్ము గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన పరిచారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా నిర్వహించాలని, ప్రతీరోజు పొడిచెత్త, తడి చెత్త సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్ ప్రసాద్, సర్పంచ్ గోవిందరాజులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలుపు నివారణ చర్యలు చేపట్టాలి

నందిగాం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వరి సాగులో కలుపు నివారణ చర్యలు తప్పనిసరి అని ఏవో పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. మంగళవారం శివరాంపురం, సైలాడ గ్రామాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. కలుపు నివారణ, యాజమాన్య పద్ధతులు, ఎరువులు యాజమాన్య పద్ధతులు, ఫసల్‌బీమా యోజన తదితర అంశాలపై రైతులకు వివరించారు.